



మహాసభల్లో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు రామకృష్ణ

విద్యా సమస్యలపై పోరాటాలు

◆ ప్రభుత్వ విద్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం
◆ ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో నాయకులు ◆ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

ప్రభుత్వ విద్యరంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని, ప్రభుత్వాల తీరును నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఉద్యమాలు చేపడతామని ఆ సంఘం నాయకులు తెలియజేశారు. కొత్తచెరువులో జరుగుతున్న భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ 6వ జిల్లా మహాసభలు సోమవారం నాడు ముగిశాయి. రెండు రోజుల పాటు మహాసభల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్య బలోపేతంపై చర్చలు జరిపారు. ప్రభుత్వ విద్యాభివృద్ధి కోరుతూ పలు తీర్మానాలు చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నిక చేశారు. రెండవ రోజు మహాసభల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓతురు పరమేష్, మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రామకృష్ణ, ఫిరంగి ప్రవీణ్ హాజరై విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. దేశాన్ని పాలిస్తున్న బిజెపి ప్రభుత్వ విద్యను కాషాయీకరణ చేసే కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యలోనూ మత విద్వేషాలు సృష్టించేలా, మూఢనమ్మకాలపై విశ్వాసం కల్పించేలా పాఠాలను తీసుకురావడం అత్యంత దుర్మార్గం అన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో ద్వారా ప్రభుత్వ విద్యకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఇక రాష్ట్రంలోనూ ప్రభుత్వ విద్యను ప్రయివేటీకరణ చేసే చర్యలు వేగవంతం అయ్యాయన్నారు. కార్పొరేట్ విద్యను ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. విద్యాలయాలు, హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాల్లో విద్యార్థులు భోజనాలు చేయడానికి డైనింగ్ హాళ్లు లేవన్నారు. సంక్షేమ హాస్టళ్లలో తాగునీరు లేదన్నారు. డిగ్రీ విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఈ నిధులు ఇవ్వకపోవడంతో ఫీజులు కట్టాలంటూ ప్రయివేటు కళాశాలల యాజమాన్యం విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి చేస్తోందన్నారు. ఫీజులు చెల్లించలేక అటు తల్లిదండ్రులు, ఇటు విద్యార్థులు సతమతం అవుతున్నారని చెప్పారు. విద్యా రంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామంటూ గొప్పలు చెబుతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆచరణలో మాత్రం చేస్తున్నది నామమాత్రమే అని విమర్శించారు. ఫీజులు కట్టకుంటే సర్టిఫికెట్లు ఇవ్వమని ప్రయివేటు కళాశాలల యాజమాన్యలు విద్యార్థులను బెదిరిస్తుంటే విద్యాశాఖ మంత్రి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను పరిరక్షణ కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభల సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా వీరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నామాల నాగార్జున, ఆఫీసు బెరర్లుగా శ్రీనాథ్, విజయ్, యశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులుగా హరి, రాజేంద్ర, సాయి అశోక్, ముద్దహీర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎల్సీ కాలువ తెగిపోవడంతో బయటకు వెళ్తున్న నీరు



అటకెక్కిన ఆధునీకరణ..!

◆ కాలువలకు తరచూ గండ్లు ◆ పుష్కలంగా నీరున్నా వినియోగంలో తప్పని అవస్థలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాగునీటి కాలువల ఆధునీకరణను ప్రభుత్వాలు అటకెక్కించాయి. దశాబ్దాలుగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఎప్పుడో నిర్మించిన కాలువల గట్లు బలహీనపడి ఎక్కడికక్కడ తెగిపోతున్నాయి. నీరు వచ్చే సమయంలో సకాలంలో తీసుకోలేక అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి.

17 ఏళ్లుగా అటకెక్కిన హెచ్ఎల్సి ఆధునీకరణ

అనంతపురం జిల్లాకు నిఖర జలాలున్న ఏకైక జలవనరు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. ఎటువంటి లిఫ్టులు లేకుండా గ్రావిటీపై వచ్చే ఈ నీరే అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ప్రధాన నీటి వనరు. తుంగభద్ర డ్యామ్ నుంచి వచ్చే ఈ కాలువ కర్నాట రాష్ట్రంలో 105 కిలోమీటర్లు ప్రయాణించాక ఆంధ్రప్రదేశ్‌లోని బొమ్మనహాళ్ మండలంలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి 189వ కిలోమీటరు వరకు ప్రధాన ఎగువ కాలువ ఉంది. ఈ కాలువ కింద ఒక్క అనంతపురం జిల్లాకే కాకుండా అటు కడప, ఇటు కర్నూలు జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు నీటిని అందించే అవకాశముంది. దీని ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లా దాహార్తి కూడా తీరుతోంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈప్రాజెక్టు ఆధునీకరణను మాత్రం ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఎప్పుడో నిర్మించిన ఈప్రాజెక్టు ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు ఆధునీకరణించాలని 2008లో రూ.458.42 కోట్లతో పనులు చేపట్టారు. సీజన్‌లో కాకుండా ఆన్‌సీజన్‌లో పనులు చేసి నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలన్నది టెండర్లు పిలిచిప్పటి లక్ష్యం. అంటే 2012 నాటికి పూర్తి చేయాలన్నది సంకల్పించారు. అది కూడా ప్రవాహ సామర్థ్యాన్ని 2400 క్యూసెక్కుల నుంచి 4200 క్యూసెక్కులకు పెంచాలని నిర్ణయించి ఆరు ప్యాకేజీల్లో టెండర్లు పిలిచారు. ఆ మేరకు పనులు రెండేళ్ల పాటు సజావుగా సాగాయి.



జల్లిపల్లి వద్ద పిఎబిఆర్ కుడికాలువకు గండిపడడంతో వృథాగా వెళ్తున్న నీరు

సుమారు రూ.309 కోట్లు ఖర్చు పెట్టారు. అంతకు ముందున్న కాలువను వెడల్పు చేసే పనులు చేపట్టారు. కాని స్ట్రక్చర్ల నిర్మాణాలు ఆపేశారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు 2014 నుంచి ఉన్న టిడిపి, 2019లో వచ్చిన వైసిపి పట్టించుకోలేదు. పైగా 2020లో దీన్ని అప్రాధాన్యత పనుల కింద పరిగణించి వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. ఇంకో ఐదేళ్లపాలు ఈ పనులు చేయడానికి వీల్లేదన్న నిబంధన కూడా పెట్టింది. ఈ ఏడాదితో ఆ నిబంధన పూర్తవనుంది. కాలువ వెడల్పు కోసమని మట్టి తవ్వి స్ట్రక్చర్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఎక్కడిక్కడ స్ట్రక్చర్లు బలహీనపడి కూలిపోతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు అధికారంలోకొచ్చిన టిడిపి ప్రభుత్వం రూ.30 కోట్లు నిధులు విడుదల చేసింది. అయితే ఇవి పూర్తి స్థాయి ఆధునీకరణకు కాదు. ఎక్కడైనా తీవ్రమైన సమస్యలుంటే వాటిని సరిచేయడానికి ఇచ్చారు. మరమ్మతులు చేసిన చోట అలాగుంటే ఇతర ప్రాంతాల్లో ఇప్పుడు కాలువ గండ్లు పడి నీరు వృథాగా పోతుండటం గమనార్హం.

ఇతర కాలువల పరిస్థితీ ఇదే తీరే

ప్రధాన కాలువ పరిస్థితి ఇలాగుంటే ఇతర కాలువల పరిస్థితి అదేతీరుగా ఉంది. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. 2015లో గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ ఆధునీకరణకు రూ.234.67 కోట్లతో చేపట్టారు. రూ.188 కోట్ల పనులు చేశాక మధ్యలో ఆపివేశారు. ఇక మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ రూ.509 కోట్లతో చేపట్టి రూ.205.79 కోట్లు ఖర్చు చేసి మధ్యలో నిలిపివేశారు. ఇలా ప్రధాన కాలువల ఆధునీకరణ అటకెక్కడంతోపాటు ప్రాజెక్టు సాధారణ నిర్వహణ నిధులు మంజూరవడం లేదు. వీటన్నింటి మూలంగా అనంతపురం జిల్లాలో సాగునీటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నీరు వస్తోందో ఇంజినీర్లు బిక్కుబిక్కుమనే పరిస్థితుల్లో ఉంటున్నారు. ఎప్పుడు ఎక్కడ గండిపతుందోనని భయపడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

ఆడబిడ్డలకు అండగా ఉంటాం

◆ తల్లీతండ్రిని కోల్పోయిన అక్కాచెల్లెళ్లకు మంత్రి భరోసా ◆ ప్రజాశక్తి కథనానికి స్పందించిన మంత్రి తదితరులు



అక్కాచెల్లెళ్లతో మాట్లాడి భరోసానిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పరిగి

అమ్మానాన్నలను కోల్పోయి అనాథలుగా మారిన అక్కాచెల్లలకు అండగా నిలిచేందుకు పలువురు ముందుకు వస్తున్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థుల దీనస్థితిని తెలియజేస్తూ రెండు రోజుల క్రితం ప్రజాశక్తిలో 'నాడు తల్లి.. నేడు తండ్రి' మరణం అన్న శీర్షికతతో ప్రజాశక్తిలో కథనం వెలువడింది. బాలికల స్థితిని తెలియజేస్తూ వారిని ఆదుకునే అపన్నహస్తం ముందు రావాలని ప్రజాశక్తి కోరింది. ఈ కథనంపై పలువురు స్పందించి బాలికలకు అండగా నిలిచేందుకు ముందుకు వస్తున్నారు. రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత సోమవారం నాడు స్వయంగా పరిగి మండల కేంద్రంలోని భజంత్రీ గోపాల్ కుమార్తెలు నివాసం ఉంటున్న ఇంటికి వెళ్లారు. తల్లిదండ్రులను కోల్పోయి విచారంలో ఉన్న అక్కా చెల్లెళ్లు అక్షిత, వందనలను మంత్రి పరామర్శించి ఓదర్చారు. వారు చదువు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్షిత హిందూపురం పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపిసి చదువుతున్నానని తెలిపింది. రెండవ కుమార్తె వందన మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నట్లు తెలిపింది. మంత్రి సువర్ణభారతి కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. అక్షితకు సంబంధించి ఫీజులను పూర్తిస్థాయిలో తగ్గించాలని కోరారు. కాగా కళాశాల వారు అక్షిత చదువులో బాగా ఉన్న నేపథ్యంలో ఇప్పటికే ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ అక్షిత విద్యకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని నీలకంఠారెడ్డి మంత్రికి తెలిపారు. ఆడపిల్లలు ఇద్దరూ బాగా చదువుకోవాలని ఇద్దరికీ తాను వ్యక్తిగతంగానూ, ప్రభుత్వ పరంగానూ అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు. మంత్రి వెంట టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ, ఏపీ లైఫ్ స్టాక్ డైరెక్టర్ వెంకటేష్, సర్పంచి బాలాజీ, మారుతి ప్రసాద్, తిమ్మారెడ్డి, మారుతీశ్వరరావు ఉన్నారు.

పెండింగ్ వేతనాలివ్వండి : సిఐటియు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో ఆశ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు కోరారు. ఈ మేరకు ఆశ వర్కర్లతో కలిసి డిఎంఅండ్‌హెచ్ఒ ఫైరోజ్‌బేగంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 27 కేంద్రాల్లో సుమారు 280 మంది ఆశా కార్యకర్తలకు అక్టోబర్, నవంబర్ నెలల వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆశా వర్కర్స్‌కు సంబంధం లేని పనులు చేయిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశాల సమస్యల పరిష్కరించని నేపథ్యంలో ఈ నెల 15 నుంచి దశల వారీగా ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బికె.రాధమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సౌభాగ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల,



వినతిపత్రం ఇస్తున్న ఆశలు, సిఐటియు నాయకులు

జిల్లా కార్యదర్శులు మహాలక్ష్మి, చెన్న కృష్ణమ్మ, అమత, లక్ష్మీ దేవి, సిఐటియు జిల్లా కోశాధికారి లక్ష్మీనారాయణ, కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి : ఓబులు

ఈనెల 31, జనవరి 1,2,3,4వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగే అఖిల భారత సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు జి.ఓబులు పిలుపునిచ్చారు. పుట్టపర్తి పట్టణం కొత్త పంప్‌హౌస్ వద్ద శ్రీసత్యసాయి వాటర్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ మహాసభల్లో భాగంగా 4వ తేదీన పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. బహిరంగ సభకు సంఘటిత, అసంఘటిత కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు, జిల్లా కోశాధికారి నల్ల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి పైపల్లి గంగాధర్, సత్యసాయి వాటర్ సప్లై వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కార్యదర్శి చింతకాయల నరేష్, మధు, యూనియన్ నాయకులు ప్రభు, నాగరాజు, రాజు, వెంకటేష్, ప్రసాద్, రాజశేఖరరెడ్డి, రవిచంద్ర రెడ్డి, నాగేంద్ర నగేష్, మల్లికార్జున, నాగభూషణ పాల్గొన్నారు.

విజయ'దీపిక'కు అపూర్వ స్వాగతం

◆ మడకశిరలో భారీ ర్యాలీ
◆ పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ
◆ మడకశిర ఇండోర్ స్టేడియంకు దీపిక పేరు



దీపికను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మాట్లాడుతున్న దీపిక



దీపిక విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-మడకశిర టౌన్

అంధుల మహిళా టి-20 ప్రపంచ కప్‌ను భారత్‌కు అందించిన జట్టుకు సారథ్యం వహించిన కెప్టెన్ దీపిక సోమవారం నాడు తన స్వగ్రామానికి విచ్చేశారు. మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం తంబాలహట్టి గ్రామానికి చెందిన దీపిక ఇటీవల అంధుల క్రికెట్ ప్రపంచకప్‌ను దేశం గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించారు. దేశానికి సారథ్యం వహించిన దీపికను మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆధ్వర్యంలో సోమవారం నాడు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల వరకు దీపికతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ జాతీయ పతాకాలను చేతబట్టి భారత్ మాతాకూ జై.. దీపికకు జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో ముందుకు నడిచారు. అనంతరం జూనియర్ కళాశాలలో ఏర్పాటు సన్మాన సభను నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలో ప్రతిభకు కొదవలేదని, అవకాశాల్ని అందిపుచ్చుకుని ముందుకు సాగితే విజయం ఎలా వరిస్తుంది అనేదానికి దీపిక నిదర్శనం అన్నారు. ప్రపంచం గర్వించే రీతిలో అంధుల క్రికెట్‌కు కెప్టెన్‌గా ఉండడమే కాక, ప్రపంచకప్‌ను అందించిన అమ్మాయి మన ప్రాంతం వాసి కావడం అభినందనీయం అన్నారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ మడకశిర ముద్దుబిడ్డ దీపిక సాధించిన విజయంతో దేశంలోనే మడకశిరకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. దీపిక విజయోత్సవ ర్యాలీ యువతకు స్ఫూర్తిదాయకంగా ఉండాలన్న సదుద్దేశంతోనే బహిరంగంగా సన్మాన సభను ఏర్పాటు చేశామన్నారు. తంబాలహట్టి నుంచి మొదలైన దీపిక ప్రస్థానం ప్రధాన మంత్రి, రాష్ట్రపతి, ముఖ్యమంత్రులు అభినందించే స్థాయికి చేరిందన్నారు. ఎమ్మెల్యే సింధూర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు దీపికను ఆదర్శంగా తీసుకుని ఎదగాలని ఆమె పేర్కొన్నారు. 'కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ దీపిక చూపు లేదని నిరుత్సాహ పడకుండా కలలను నిజం చేసేందుకు కష్టపడి సాధించిన విజయం జిల్లాకే గర్వకారణం అన్నారు. మడకశిర ఇండోర్ స్టేడియంకు దీపిక ఇండోర్ స్టేడియం అని నామకరణం చేస్తామని తెలిపారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ దీపిక విజయం ప్రతి విద్యార్థి యువత స్ఫూర్తితో తీసుకుని రాణించాలని పేర్కొన్నారు. సినీ నటుడు సాయికుమార్ మాట్లాడుతూ దీపిక లాంటి యువతులను ప్రతి ఒక్క విద్యార్థి ఆదర్శంగా తీసుకుని జీవితంలో విజయం సాధించాలని తెలియజేశారు. విజయానికి పేదరికం, అంధత్వం అడ్డు కాదని దీపిక నిరూపించిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ మడకశిర ముద్దుబిడ్డయినటువంటి దీపిక సాధించిన విజయం మడకశిరకే గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం దీపికను అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ మూర్తి, రాధాకృష్ణ, వక్రీ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఛైర్మన్ నరసింహ రాజు, డాక్టర్ రవి శేఖర్, క్రికెట్ అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తింపునిచ్చిన విజయం : దీపిక

దేశానికి ప్రపంచ కప్‌ను అందించిన ఘనత తనకు గుర్తింపును ఇచ్చిందని కెప్టెన్ దీపిక తెలియజేశారు. తాను 2019లో క్రికెట్‌లోకి వెళ్లిన సమయంలో అంధుల క్రికెట్‌ను ప్రోత్సహిస్తున్న మహంతిష్ ఆధ్వర్యంలో కర్ణాటకలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం ఎంతగానో తోడ్పాటును అందిచిందన్నారు. తనకు దక్కిన ఈ విజయంతో మా తల్లిదండ్రులు నేడు గర్వంగా తలెత్తుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 10 లక్షల రూపాయలు ఆర్థిక సహకారాన్ని అందించడమే కాకుండా తనను మట్టిలో మాణిక్యం అంటూ అభినందించడం ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జీవితంలో విజయం సాధించేలా అందరూ ముందుకు సాగాలని విద్యార్థులకు దీపిక పిలుపునిచ్చారు.

దీపికకు విరాళాలు

అంధుల క్రికెట్‌లో ప్రతిభ చూపిన దీపికకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు విరాళాలు ప్రకటించాయి. పుట్టపర్తి జిల్లా కేంద్రంలో పది సెట్లు స్థలాన్ని దీపికకు ఇస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ రూ.2.16 లక్షలు, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు రూ.2లక్షలు, యాదవ సంఘం రూ.లక్ష, సింగల్ విండో అధ్యక్షులు రూ.లక్ష, అమరాపురం తెలుగుదేశం పార్టీ నాయకులు రూ.50వేలు, ఒక్కళిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ రూ.50వేలు, జెడ్పిటిసి ఉమేష్ 10 వేల రూపాయల చెక్కులను దీపికకు అందజేశారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేలా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం నాడు పుట్టపర్తి కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహ ముక్త భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న "బాల్య వివాహం ఆపుదాం దేవుని కృపను పొందుదాం"అనే నినాదంతో తయారుచేసిన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లాను పూర్తిగా బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి అధికారి, స్వచ్ఛంద సంస్థ, గ్రామస్థాయి సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలి. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుందని సమాచారం అందినా, తెలిసినా 1098కు ఫిర్యాదు చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో విస్తతమైన అవగాహన తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీవో సువర్ణ, ఐసిడిఎస్ పీడీ ప్రమీల, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఈవో క్రిష్టప్ప, డీసీపీవో మహేష్, మురళీధర్, సోషల్ వర్కర్ ఆనంద్, పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

మహిళల సమాన హక్కులతో సమాజాభివృద్ధి

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గల ఆడిటోరియంలో సోమవారం ఐద్వా, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినులకు 'మహిళా హక్కులే మానవ హక్కులు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు ముఖ్య అతిథులుగా శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దిల్షాద్, అంగన్వాడి సంఘ జిల్లా అధ్యక్షులు శ్రీదేవి, ఐద్వా మండల నాయకులు గౌతమి హాజరయ్యారు. ముందుగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, స్పెషల్ ఎడ్యుకేటర్ దిలీప్ కుమార్ జ్యోతిబాపూలే, బిఆర్ అంబేద్కర్, గురజాడ అప్పారావు చిత్రపటాలకు నివాళులు అర్పించి సదస్సు ప్రారంభించారు.అనంతరం దిల్షాద్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు సమాన హక్కులు పొందినప్పుడే మానవాళి అభివృద్ధి చెందుతుందన్నారు. సమాజంలో మహిళ పాత్ర, మహిళ హక్కులు, మహిళా చైతన్యం క్రీడలలో మహిళల విజయాలు తదితర విషయాలను వివరించారు. ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ అలివేలమ్మ బ్యాడ్ టచ్ గుడ్ టచ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రజియా, భారతి, మల్లేశ్వరి, అశ్విని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకట లక్ష్మమ్మ , పాలసముద్రం ఇళ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ అంజనాదేవి , కమిటీ నాయకులు లక్ష్మీ నరసమ్మ , ఐద్వా సోమందేపల్లి మండల నాయకులు హనుమక్క , ప్రభావతితో పాటు 260 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దిల్షాద్

మొరాయించిన ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి - రొద్దం

హిందూపురం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు సోమవారం రొద్దం మండలకేంద్రంలో మొరాయించింది. దీంతో విద్యార్థులే ఆబస్సును వెనుకనుంచి తోశారు. ఈ బస్సు ప్రతిరోజు హిందూపురం నుంచి రొద్దం వచ్చి అక్కడ నుంచి గౌరాజుపల్లి, ఎం కొత్తపల్లి, మోపర్లపల్లి, తాడంగపల్లి వరకు ఉదయం సాయంత్రం వెళ్లి వస్తుంది. అయితే సోమవారం సాయంత్రం విద్యార్థులు, ప్రయాణికులతో వెళ్లే సమయంలో రొద్దం లో వైస్సార్ సర్కిల్ వద్ద బస్సు మొరాయించింది. స్టార్ట్ కాకపోవడంతో విద్యార్థుల చేత బస్సును తోయించారు. కాలం చెల్లిన బస్సులను నడపడంతో ఎక్కడబడితే అక్కడ ఆగిపోతూ ప్రయాణికులకు సమస్యగా మారుతున్నాయని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థుల చేత బస్సు తోయించడం పై పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని కోరుతున్నారు.



మొరాయించిన ఆర్టీసీ బస్సును తోస్తున్న విద్యార్థులు

చింతచెట్లు వేలం

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని బూచర్ల పంచాయతీ రాగి మేకలపల్లిలో ఉన్న 11 చింత చెట్లను సోమవారం వేలం పాట నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో గోవిందప్ప, పంచాయతీ అభివృద్ధి అధికారి కృష్ణమూర్తి, విఆర్ఒ సూర్యనారాయణ, ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఇందులో ఆర్ కే హనుమంత రాయుడు 16000 రూపాయలకు చింతచెట్ల ఫలసాయాన్ని దక్కించుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గోవిందప్ప, బూచర్ల పంచాయతీ సర్పంచి సోమశేఖర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు భాష, డీలర్ చంద్రమౌళి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర చెరువుకు కృష్ణా జలాలు

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మడకశిర చెరువుకుకృష్ణాజలాలు చేరాయి. మూడు రోజుల నుంచి మడకశిర చెరువుకు కృష్ణాజలాలు చేరుతున్నాయి. దీంతో చెరువు కింద ఉన్న ఆయకట్టు భూమి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో నీరు ఉంటే భూగర్భజలాలు పెరిగి వ్యవసాయ బోరు బావుల్లో పుష్కలంగా నీరు లభిస్తుందని చెబుతున్నారు.

ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎరుకుల సామాజికవర్గం వారు తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం స్థానిక తహశీల్దార్ మారుతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆసంఘం నాయకులు మాట్లాడుతూ ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు స్థలం మంజూరు చేసి భవన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ మానిటింగ్ సభ్యులు దేవరకొండ ఉమా శంకర, మాజీ ఎంపిటిసి మునిస్వామి, టౌన్ ప్రెసిడెంట్ నరసింహప్ప, వన్నప్ప, రమణ, సురేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

గ్రామ సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపిడిఒం పార్థసారధి తెలిపారు సోమవారం మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమయానికి ఉద్యోగులు హాజరైనప్పుడు గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో దేవదర్శన్ రెడ్డి, ఈవోఆర్డీ మాధవరెడ్డి, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

రస్తా సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల పరిధిలోని తూర్పు నడింపల్లి పంచాయతీలోని కొన్ని సంవత్సరాల నుంచి నెలకొన్న రస్తా సమస్య పరిష్కారం అయింది. సమస్యను కందికుంట వెంకటప్రసాద్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు సోమవారం ఆ గ్రామాన్ని సందర్శించి రాస్తా సమస్యను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దేవేందర్ నాయక్, ఎంపీడీవో పార్థసారథి, డిప్యూటీ ఎంపీడీవో మాధవరెడ్డి, ఎస్ఐ వలిబాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - నల్లమాడ

మండలంలోని పలువురు బాధితులను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సోమవారం పరామర్శించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు ఎర్రవంక పల్లికి చెందిన అన్నం లక్ష్మీనారాయణ కుటుంబాన్నిపరామర్శించారు. అదే విధంగా గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించారు. అనంతరం వెళ్ళమద్ది ,రెడ్డిపల్లి ,నల్లమాడ మండల కేంద్రంలో పల్లె రఘునాథ్ రెడ్డి పర్యటించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మిగులు స్థలాల కబ్జా

తహశీల్దార్‌కు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి బత్తలపల్లి

తాము అధికారంలో ఉన్నాం.. తమను అడ్డుకునే అధికారం ఎవరికుంది.. తామేమీ చేసినా అడిగేనాథుడే లేరంటూ కూటమి నేతలు దౌర్జన్యంగా కోసు (మిగులు) స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వైసిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ బత్తలపల్లిలోని తాడిపత్రి రోడ్డులో గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మాణాల్లో భాగంగా జగనన్న లేఅవుట్ వేసి స్థలాలు పంపిణీ చేసిందన్నారు. లే అవుట్ వేసే సమయంలో ఒకటిన్నర సెంటు స్థలం రాకుండా కోసులుగా వచ్చిన స్థలాలను వదిలేశారన్నారు. అదేవిధంగా తాడిపత్రి రోడ్డు విస్తరణ జరిగితే రోడ్డుకు స్థలం కూడా వదిలేసి ఇంటి పట్టాలు పంపిణీ చేశారన్నారు. ఈ మిగులు స్థలాల్లో ముందు చూపుగా కాలనీలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టేలా స్థలం వదిలారన్నారు. అయితే గత ప్రభుత్వంలో ఇంటి పట్టాలు పొంది, వారి ఇంటి ముందు ఉన్న మిగులు స్థలాలు(నెంబర్ లేని ప్లాట్లు)ను రోడ్డు విస్తరణకు వదిలేసిన స్థలాలను కలుపుకొని కూటమి నేతలు అండతో కొందరు దౌర్జన్యంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రశ్నిస్తే దుర్భాషలాడుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారన్నారు. స్పందించిన తహశీల్దార్ అక్రమ నిర్మాణాలు ఎవరు చేపట్టినా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌మార్, నియోజకవర్గ కల్చరల్ వింగ్ అధ్యక్షులు షరాజ్ యోగానంద ఆచారి, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు అక్కిం దామోదర్, ఈడిగ కాకప్ప తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్, బెల్ట్ షాపులను నియత్రించాలి : సిపిఎం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజల జీవితాలతో, యువత భవిషత్తుతో చెలగాటం ఆడుతున్న గంజాయి, డ్రగ్స్, బెల్ట్ షాపులను నియత్రించాలని, ప్రోత్సహిస్తున్న, అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎక్సైజ్ ఎస్ఐ రాజశేఖర్ కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హరి, మండలనాయకులు బాబావలి, గంగాధర్, వెంకటరాముడు మాట్లాడుతూ. గంజాయి డ్రగ్స్ మూలంగా యువత భవిష్యత్తు నాశనమవుతుందని వారి భవిష్యత్తును కాపాడాల్సిన అవసరం అందరిపైనా ఉందని అన్నారు. గంజాయి వ్యాపారానికి అడ్డువస్తే అమానుషంగా, విచక్షణ రహితంగా ఎలా దాడి చేశారో నెల్లూరు పెంచలయ్య హత్య నిదర్శనమన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని నియంత్రణ దిశగా అడుగులు వేస్తే ఉపయోగం కరంగా ఉంటుందిఅని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటినుంచి గంజాయి, మాదక ద్రవ్యాలు, కర్నాటక మద్యం అమ్మకాల జోరు పెరిగిందని ఆరోపించారు. గ్రామాలలోఎక్కడ చూసిన బెల్ట్ షాపులున్నాయన్నారు.ప్రభుత్వం ఆదాయమే పరమావధిగా తెచ్చిన మద్యం పాలసీ వల్ల వేలాదిగా మద్యం షాపులు వచ్చి, ప్రజల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులపై ప్రభావం పడి, వారి కుటుంబాలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు.గంజాయి, డ్రగ్స్ కారణంగా యువత చేడు మార్గంలో పడి భవిష్యత్తు అంధకారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.గంజాయి, డ్రగ్స్ నియంత్రణలో భాగంగా యువతకు, గ్రామాలలో విరివిగా అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్య పరచాలనివారు ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా పెనుకొండ పట్టణంలో రహదారికి ఇరువైపుల మద్యం షాపులు ఉండటం వల్ల మహిళలు, విద్యార్థులకు,వాహనదారులకు పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని లన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు నరసింహ, మహబూబ్ బాష పాల్గొన్నారు.

గుండుమల కేజీబీవీలో ముగ్గురికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి మడకశిర టౌన్

గుండుమల కేజీబీవీ హాస్టల్లో సమస్యలు తిష్టి వేశాయి. సమస్యల పరిష్కారంలో ఎస్ఒ నిర్లక్ష్యం వహించడంతో ఆమెతో పాటు మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు విద్యాధికారి తెలిపారు. ఆదివారం రాత్రి ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా అనేక సమస్యలు ఆయన దృష్టికి వచ్చాచి. దీంతో కెజిబివిని సందర్శించి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే స్థానిక ఎంఇఒను ఆదేశించారు. దీంతో ఆయన కెజిబివిని సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా పలు సమస్యలు ఆయన దృష్టికి వచ్చాయి. రాగి జావా అన్నంలో పురుగులు ఉన్నాయన్న ఫిర్యాదు వచ్చింది అంతేకాకుండా 250 మంది బాలికలకు ఒకే ఒక బాత్రూం ఉండడంతో విద్యార్థులు పడుతున్న సమస్యను ఎంఇఒ గ్రహించారు. మరోవైపు నీటి సమస్య కూడా అధికంగా ఉంది. అంతేకాకుండా ఇక్కడ పనిచేసే సిబ్బంది సైతం బాలికల పట్ల దుర్భాషలాడుతున్నారన్న ఆరోపణలు ఆయన దృష్టికి వచ్చాయి. సాయంత్రాల్లో స్నాక్స్ ఇవ్వడం లేదని ఎస్ఒ చాందిని విద్యార్థులతో ట్రాన్స్‌పోర్టుకు ఒక్కో విద్యార్థి నుండి 300 రూపాయలు వసూలు చేసినట్లు కూడా విద్యార్థులు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా సోలార్ ఏర్పాటు కోసం ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల వద్ద 500 రూపాయలు వసూలు చేసినట్లు ఫిర్యాదులందాయి. ఇది ఇలా ఉండగా వంటగదిలో సైతం పిల్లలే సహాయకులుగా పనిచేయాల్సిన పరిస్థితి ఉంది. మొత్తం ఈ తతంగంపై ఎంఇఒ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇక్కడ పని చేసే ముగ్గురికి షోకాజు నోటీసులు జిల్లా అధికారుల నుంచి అందనున్నట్లు తెలిసింది.

మెడికల్ కోర్సులు చేస్తే తక్షణ ఉపాధి

శాంత విద్యాసంస్థల ప్రొఫెసర్ పవన్ కుమార్



కోర్సుల గురించి వివరిస్తున్న పవన్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

ఇంటర్మీడియట్ లో బైపిసి పూర్తి చేసుకున్న వారు డిగ్రీలో మెడికల్ సంబంధించిన కోర్సులు పూర్తి చేసుకుంటే తక్షణ ఉపాధి లభిస్తుందని శాంత విద్యాసంస్థల కార్డియా కేర్ ప్రొఫెసర్ పవన్ కుమార్ విద్యార్థులకు సూచించారు. సోమవారం శాంత విద్యాసంస్థల ఆధ్వర్యంలో పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాలతో పాటు ఐకాన్ జూనియర్ కళాశాల, శ్రీ విద్యానిధి, ఎల్ ఆర్ జి జూనియర్ కళాశాలల్లో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు డిగ్రీలో మెడికల్ కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు డాక్టర్ కావాలని బైపిసిలో చేరి ఎంతో కష్టపడి నీట్ పరీక్షకు సిద్ధం అవుతారన్నారు. అయితే దురదృష్టవశాత్తు నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినప్పటికీ అనుకున్న ర్యాంకులు రాకపోవడంతో మెడికల్ సీట్ రావడం కష్టంగా మారుతుందన్నారు. అలాంటి సమయంలో విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోతున్నామని నిరుత్సాహానికి గురవుతారన్నారు. అయితే వారు అలా నిరుత్సాహం చెందాల్సిన అవసరం లేదన్నారు. డిగ్రీలో బీఎస్సీ నర్సింగ్ తో పాటు కార్డియాకేర్, బి ఫార్మసీ, అనీస్థిషియా, రేడియాలజీ, ఆప్తమాలజీ, ఎక్సరే టెక్నాలజీ, ఎం.ఎల్.టి, ఫిజియోథెరపీ ఇలా ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ కోర్సులు పూర్తి చేస్తే తక్షణ ఉపాధి లభించడంతోపాటు డాక్టర్ అయ్యామన్న సంతృప్తి కూడా లభిస్తుందన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల కలలను సాకారం చేయడం కోసం డాక్టర్ సుధాకర్ సారథ్యంలో రాజీవ్ గాంధీ విశ్వవిద్యాలయం అన్ని అనుమతులతో శాంత విద్యాసంస్థలను నెలకొల్పడం జరిగిందన్నారు. ఈ విద్యా సంస్థ హిందూపురం నియోజకవర్గానికి సమీపంలో పెరేసంద్ర వద్ద ఉందన్నారు. పదవ తరగతి పూర్తి చేసుకున్న వారితో పాటు ఇంటర్ బైపీసీ పూర్తి చేసుకున్న వారికి అవసరమైన అన్ని మెడికల్ కోర్సులు శాంత విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులతో పాటు బడుగు బలహీన వర్గాల వారు ఈ కోర్సుల్లో చేరి డాక్టర్ కావాలన్న వారి సంకల్పాన్ని పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు బిందు, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కోవడానికి ప్రత్యేక శిక్షణ

డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ పి.వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

ప్రజాశక్తి-పెనుకొండ

అగ్నిమాపక సిబ్బందిని ఎలాంటి విపత్తులైనా ఎదుర్కోవడానికి సిద్ధం చేస్తున్నామని డిజిఎఫ్ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్)పి.వెంకటరమణ అన్నారు. సోమవారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలోని రీజినల్ శిక్షణ కేంద్రంలో టిఒటి శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి మంచి ప్రావీణ్యం ఉన్న 52 మందిని శిక్షణకు ఎంపిక చేసామన్నారు. శిక్షణ అనంతరం ఆయా జిల్లాల పరిధిలోని అగ్నిమాపక సిబ్బందికి వీరు శిక్షణ ఇస్తారని తెలిపారు. విపత్తుల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రావడానికి ఆలస్యం అవుతుందని అంతలోపు అగ్నిమాపక సిబ్బంది విపత్తులను ఎదుర్కోవడానికి ఈ శిక్షణ దోహదపడుతుందని అన్నారు. శిక్షణలో ట్రెక్కింగ్ ఈత తదితర అంశాలపై ప్రావీణ్యం కలిగిన శిక్షకులతో శిక్షణ అందిస్తున్నామన్నారు. అగ్నిమాపక శాఖను బలోపేతం చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. కాలం చెల్లిన అగ్నిమాపక వాహనాల స్థానంలో నూతన వాహనాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు రాష్ట్రంలోనే పెనుకొండ అగ్నిమాపక కేంద్రాన్ని ఆదర్శంగా నిలుపుతామన్నారు. అంతకుముందు అగ్నిమాపక శాఖ సిబ్బందితో పెనుకొండ కొండపైకి ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్ రెడ్డి. జిల్లా ఫైర్ ఆఫీసర్ మాధవ నాయుడు, పెనుకొండ ఫైర్ ఆఫీసర్ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మోడల్‌పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

మండలంలోని మావటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు రాజేశ్వరి కాలనీలో పనిచేసే ఉపాధ్యాయురాలు భువనేశ్వరి పదవ తరగతి మోడల్ పేపర్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మండల విద్యాశాఖాధికారి సుధాకర్ , పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేంద్ర ప్రసాద్, యుటిఎఫ్ నాయకులు నబీ, రవీంద్ర నాథ్, ఉపేంద్ర, రామాంజినేయులు తదితరుల చేతుల మీదుగా వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో యు టి ఎఫ్ నాయకులు ఉపేంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు : మండల పరిధిలోని చినగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు యుటిఎఫ్ తయారుచేసిన మోడల్ టెస్ట్ పేపర్లను సోమవారం అందజేశారు.కదిరి సిమ్స్ హాస్పిటల్ ఎమ్‌డి నిసార్ యాషిన్ ఖాన్ ఉచితంగా వాటిని పంపిణీ చేవారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రవిరాజ్, యుటిఎఫ్ నాయకులు ఖాజాపీర్, ఉమాపతి ఉపాధ్యాయులు సునీత, హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

ప్రజాశక్తి - మడకశి టౌన్

కలెక్టర్ శ్యాంప్రసాద్ సోమవారం రాత్రి మడకశిరలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ (కేజీబీవీ) వసతి గృహాన్ని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి భోజనం, చదువు, భద్రత సంబంధిత అంశాలను వారు తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుతున్న తరగతి గదులు, వసతిగృహాలు, కిచెన్, స్టోర్ రూమ్, పరిశుభ్రత వంటి అంశాలను కలెక్టర్ పరిశీలించారు. భోజనం నాణ్యతను తనిఖీ చేయడానికి విద్యార్థులతో కలిసి కలెక్టరు, ఎమ్మెల్యే అక్కడే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.



విదార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

నేరాలు ఘోరాలు

కిడ్నాప్ కలకలం

ఇన్నోవా కారు, రూ.1.20 కోట్లు స్వాధీనం

వివరాలు వెల్లడించిన పోలీసులు

ప్రజాశక్తి - పెనుకొండ

ఇన్నోవా కారుతో సహా ఇద్దరు వ్యక్తులను గుర్తుతెలియని వ్యక్తులు చేసిన కిడ్నాప్ యత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. కిడ్నాపర్లు పరారుకావటంతో కారును, అందులోని రూ.1.20 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సినీపక్కీని తలపించే ఈఘటనకు సంబందించిన వివరాలను పెనుకొండ సిఐ రాఘవన్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ఈనెల 3న గుజరాత్ రాష్ట్రం సూరత్ నుంచి ఒక ఇన్నోవా కారు బెంగళూరుకు బయలుదేరింది. మార్గం మధ్యలో రెండు కార్లు గుజరాత్ నుంచి వస్తున్న ఆ కారును వెంబడించి అందులో ఉన్న ఇద్దరిని కారుతో సహా కిడ్నాప్ చేశారు. ఈ తంతును గమనించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పెనుకొండ బాబయ్య స్వామి గంధం మహోత్సవం రోజు కావటంతో ఆ రోజు రాత్రి గోరంట్ల సిఐ శేఖర్ 44వ జాతీయ రహదారి లోని శ్రీకృష్ణదేవరాయుల సర్కిల్ వద్ద విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో బెంగళూరు వైపు వెళుతున్నట్లు ఉన్న ఆగిఉన్న కారును గమనించారు. తమకు అందిన సమాచారం మేరకు సిఐ అక్కడి వెళ్లారు. కారును, కిడ్నాప్ గురైన గుజరాత్‌రాష్ట్రానికి చెందిన పల్కేష్, అనిరుద్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కారు సీట్ల కింద ఏర్పాటు చేసిన ప్రత్యేక అరలో ఉన్న రూ.1.20 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ డబ్బు అనుమానాస్పదంగా ఉండడంతో స్వాధీనం చేసుకున్నామని ఈ నగదును కోర్టుకు అప్పగించామని సిఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇన్నోవా కారు

ఇన్నోవా కారులో సీట్ల కింద ప్రత్యేక అరలో ఏర్పాటు చేసి అందులో రూ.1.20 కోట్లు ఉంచి, మిగిలిన డబ్బు బ్యాగుల్లో తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం బ్యాగులో ఉన్న నగదును మాత్రమే దుండగులు అపహరించుకు వెళ్లారని తెలుస్తోంది. రహస్యంగా కారు సీట్ల కింద ఉన్న అరలలో ఉన్న నగదును దుండగులు గుర్తించకపోవడంతో పోలీసులు ఈ నగదును స్వాధీనం చేసుకున్నారు. కిడ్నాప్ కు గురైె పోలీసులు అదుపులో తీసుకున్న వ్యక్తులు సుగంధ ద్రవ్యాల వ్యాపారస్తులని తెలుస్తోంది.

ప్రత్యేక బృందాలతో దర్యాప్తు : సినీ పక్కిలో జరిగిన ఈ దొంగతనంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిజాలను నిగ్గు తేల్చేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. కారులో కిడ్నాప్ గురైన వ్యక్తులే ఇలా పథకం ప్రకారం డబ్బును అపహరించారా? లేదా దుండగులు కారును వెంబడించి డబ్బులు దొంగలించారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆలయ ఈవో మురళీకృష్ణ అరెస్టు : డీఎస్పీ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మండల పరిధిలోని ఎర్రదొడ్డి గంగమ్మ దేవస్థానంలోని వెండినగలు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించిన ఆలయ ఈవో మురళీకృష్ణను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు దేవాదాయశాఖ అధికారులు అనుమతి లేకుండా దాదాపు 5 లక్షల రూపాయలు విలువగల అమ్మవారి వెండి వస్తువులను తీసుకెళుతుండగా ప్రజలు అడ్డుకుని పోలీసులకు అప్పగించారన్నారు. దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఈవోను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చుతున్నట్లు చెపాపరు. ఈ సంఘటన వెనుక ఎవరైనా ఉన్నారా అనే అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకొని విచారణ చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ నిరంజన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ఈవో వ్యవహారంపై సిఎం ఆగ్రహం : ఆలయ ఈవో మురళీకృష్ణ వ్యవహారంపై సిఎం చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆలయ ఈవోను సస్పెండ్ చేయాలని ఆశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని మండ్లి గ్రామానికి చెందిన మారుతి భార్య ప్రశాంతి (22) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు.. మారుతి సమీపంలోని ఎస్టేట్లో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి పెళ్లి జరిగే మూడు సంవత్సరాలయింది. ఇప్పటిదాకా సంతానం లేకపోవడంతో పలు ఆసుపత్రుల్లో చూపించినా ఫలితం లేకపోయింది. దీంతో మనస్థాపనకు గురైన ప్రశాంతి సోమవారం తమ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీఆర్వోపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తాడిమర్రి

తన భూమిని మరొకరికి పట్టా మంజూరుకు సహకరించిన విఆర్ఒపై చర్యలు తీసుకోవాలని బాధితుడు రామాంజనేయులు, గ్రామస్తులు కోరారు. మండల పరిధిలోని భీమరాయుని పేట గ్రామ నివాసి అయిన రామాంజనేయులు సర్వే నంబర్ 416లోని భూమి 40 సంవత్సరాల నుండి వారి తల్లిదండ్రుల ఆధీనం నుండి ఇతని ఆధీనంలోకి వచ్చింది. అందులో మూడు సెంట్ల భూమిని ఇల్లు కట్టుకొనుటకు అదే గ్రామానికి చెందిన రాజశేఖర్ నాయుడు అనే వ్యక్తి దొంగ పట్టా సృష్టించుకుని తనదే అని ఆ భూమి అని అంటున్నాడని బాధితుడు వాపోయాడు. రాజశేఖర్ నాయుడుకు అక్కడి వీఆర్వో రాముడు సహకరించాడని దీనిపై విచారించి తగు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తులతో కలసి బాధితుడు రామాంజనేయులు నిరసన చేశాడు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ భాస్కర్ రెడ్డికి అందజేశారు.

సొంత గ్రామానికి సాయం

ప్రజాశ్తకి - బత్తలపల్లి

తాను పుట్టిపెరిగిన గ్రామాభివృద్ధికి ఓ ఎన్ఆర్ఐ తనవంతు సాయం అందించారు. మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన చిందులూరి బాబుప్రసాద్ అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన గత ఏడాది గ్రామంలోని రామాలయ అభివృద్ధికి రూ.5 లక్షలు అందజేశారు. ఈ మేరకు ఆయన సోమవారం గ్రామానికి వచ్చి తన భార్య సరస్వతితో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లి అక్కడ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత గ్రామానికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అంజన, గ్రామ నాయకులు మోహన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - సోమందేపల్లి

మండల పరిధిలోని కేతగాని చెరువు గ్రామంలో తెలుగుదేశం కార్యకర్త రామాంజనప్ప భార్య ఆదిలక్ష్మమ్మ మృతిచెందింది. అదే గ్రామానికి చెందిన అంజినప్ప అనారోగ్యంతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. సుద్దుకుంటపల్లి గ్రామానికి చెందిన శివ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. చాలకూరు గ్రామానికి చెందిన వెంకటరమణ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మంత్రి సవిత బాధిత కుటుంబాలను సోమవారం పరామర్శించారు. పలువురికి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వెంకటేష్, రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్రాముడు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, మాజీ కన్వీనర్ సిద్ద లింగప్ప, మద్దిలేటి, భాను కీర్తి, సంజీవరెడ్డి, మోహన, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలి : వైసిపి



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-సోమందేపల్లి

ప్రభుత్వ సంస్థల ప్రయివేటీ కరణను ఆపాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం పర్యటించిన ఆమె స్థానిక వైయస్సార్ సర్కిల్లో గల వైయస్సార్‌విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తే దాని పర్యవసానం ఎలా ఉంటుందో అనేదానికి నిదర్శనమే నేడు ఇండిగో విమాన సంస్థ ఒక ఉదాహరణగా నిలిచిందన్నారు. దీనికి కేంద్ర విమానయాన శాఖామంత్రి రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ సంస్థలు ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని అలాగే మెడికల్ కాలేజ్ లను ప్రైవేటీకరణ చేపట్టడాని ఆపాలని డిమాండ్ చేశారు. తాము చేపట్టిన కోట సంతకాల సేకరణ కోటి సంతకాల పత్రులను బుధవారం జిల్లా కేంద్రానికి వెళ్లి అధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గజేంద్ర, మేజర్ పంచాయతీ ఉప సర్పంచి వేణు, జడ్పిటిసి అశోక్, మంజునాథ్, మురళి, నాగరాజు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పునరావృతం కానీయొద్దు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని జిల్లా ఎస్పీ అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు సోమవారం 114 పిటీషన్లు అందాయి. వివిధ ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పిజిఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలకు గడువులోగా చట్ట పరమైన పరిష్కారం చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎస్ ఇందిర, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ సెల్ సిఐ ఇస్మాయిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉధృతమవుతున్న హిందూపురం జిల్లా ఉద్యమం

ప్రజాశక్తి-హిందూపురం



ఐక్యత చాటుతున్న ప్రజా సంఘాల నాయకులు

హిందూపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలన్న ఉద్యమం ఉధృతమవుతోంది. గతంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇచ్చిన హామీ మేరకు హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు స్థానిక ఇందిరాపార్కు లో సమావేశమై చర్చించారు. న్యాయవాది ఇందాద్ అధ్వర్యంలో బహుజన సమాజ్ నాయకులు శ్రీరాములు అధ్యక్షతన సామాజిక సేవకులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ నేతత్వంలో దాదాపు 25 ప్రజా సంఘాలు సమావేశమై చర్చించారు. అనంతరం ర్యాలీగా అంబేద్కర్ సర్కిల్ కు వెళ్లి అంబేద్కర్ కు పూల మాలవేసి వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గతంలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ స్వయంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో హిందూపురం జిల్లా కోసం ఉద్యమించారని, రాష్ట్రంలో తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే హిందూపురం జిల్లా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లాల కోసం ఏర్పాటు చేసిన మంత్రుల సబ్ కమిటీ హిందూపురాన్ని ఒక్కసారి కూడా పరిశీలించకుండానే ప్రజల అభిప్రాయాలు, వినతులు సేకరించకుండానే విజయవాడలో కూర్చుని మూడు జిల్లాలను ప్రకటించడం పూర్తిగా అన్యాయంగా ఉందన్నారు. ఇప్పటికైనా సబ్ కమిటీ హిందూపురానికి వచ్చి ప్రజల అభిప్రాయాలు తీసుకొని, వాస్తవ పరిస్థితులను చూసి, హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూపురం జిల్లా కేంద్రం సాధన కార్యాచరణకు హిందూపురం జిల్లా కేంద్రం సాధన సమితి కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమం కొనసాగిస్తామని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, బహుజన సమాజ్ పార్టీ నాయకులు నాగరాజు, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రవికుమార్, కుల వివక్ష పోరాట సమితి, ఎంఐఎం నాయకులు, ఎస్డీపీఐ నాయకులు, ఎరుకుల హక్కుల సంఘం ఈశ్వరయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జమీల్, వైస్సార్సీపీ నాయకులు అమానుల్లా, న్యాయవాదులు రామచంద్ర రెడ్డి, వన్నేరువప్ప, విద్యార్థి సంఘాల నాయకులు బాబావలి, చంద్ర శేఖర్ రెడ్డి, కదరిష్, వంశీ ఉదయ్ కుమార్, శ్రీరాములు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

ప్రతిభా విద్యార్థులకు విమాన ప్రయాణం

ప్రజాశక్తి - తలుపుల

మండలంలోని 5 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో పదిపరీక్ష ఫలితాల్లో మండలంలో మొదటి మూడుస్థానాలు సాధించిన ఎస్సీ విద్యార్థులకు విమాన ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఫ్రెండ్స్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.కడప ఎయిర్ పోర్ట్ నుండి హైదరాబాద్ వరకు విమాన ప్రయాణం కలిగించి అక్కడ వారికి బ్యాగ్,బట్టలు, షూస్, ఆహారం కల్పించి రెండు రోజులపాటు హైదరాబాదులో చారిత్రకమైన ప్రదేశాలను చూపిస్తామన్నారు. అలాగే వారిని తిరిగి సురక్షితంగా తీసుకురావడం జరుగుతుందని ఫ్రెండ్ ట్రస్ట్ సభ్యుడు మన్సూర్ తెలిపారు.

కోటి సంతకాల పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి-హిందూపురం



సంతకాల పుస్తకాలను వేణురెడ్డికి అందిస్తున్న నాయకులు

హిందూపురం మున్సిపల్ పరిధిలోని 1వ వార్డుకు సంబంధించిన కోటి సంతకాల సేకరణ పుస్తకాలను నాయకులు సోమవారం వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణు రెడ్డికి అందజేశారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంతకాల సేకరణ చేపట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సంతకాలు పూర్తి కావడంతో వార్డు ఇన్చార్జిలు సాంబశివ, పృథ్వీరాజ్ పుస్తకాలను వేణురెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కొల్లకుంట శివశంకర్ రెడ్డి, పట్టణ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నీలూరి ఆంజనేయులు, అల్లాబకాష్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన రహదారుల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-హిందూపురం



మాట్లాడుతున్న చైర్మన్ రమేష్ కుమార్

హిందూపురం పట్టణంలోని ముక్కిడిపేట, నింకంపల్లిలో నూతన రహదారుల నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలను పాటించి సకాలంలో పనులు పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నసీరా భాను, ముస్తాక్ మహమ్మద్, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ జెవి. అనిల్ కుమార్, మైనార్టీ కమిషన్ సభ్యులు ఆర్ఎంఎస్ ఫైజుల్లా, టిడిపి నాయకులు అమరనాథ్, నెట్టప్ప, అంజాద్, షఫీ, దుర్గా నవీన్, అన్వర్, అజ్మతుల్లా, ఫాజిల్, జబీవుల్లా, డిఇఇ వాణి, ఏ.ఈ. జనార్ధన్, కాంట్రాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీకి వసతుల కల్పన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మేజర్ పంచాయతీ పరిధిలోని పాపిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో కనీస వసతులను కల్పిస్తున్నట్లు టిడిపి నాయకులు, అధికారులు తెలిపారు. ఈ మేరకు ఎస్సీ కాలనీని సోమవారం టిడిపి హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, పవన్ కన్వీనర్ వడ్డే సూరి, ఎంపీడీవో వెంకటలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో ప్రేమ్ కుమార్ సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు గ్రామానికి అవసరమైన డ్రైనేజీను, సిసి రోడ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కాలనీ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను, ఓవర్ ట్యాంక్ చుట్టూ ఉన్న వ్యర్థాలను జెసిబి తో తొలగించారు. అనంతరం మండల విద్యాధికారి ఆంజనేయులు నాయక్ తో కలిసి సమీపంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించి అక్కడున్న వసతులను పరిశీలించారు.

చేనేత హామీలను నెరవేర్చాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , చేనేత కార్మికులకు మూడు సెంట్లు ఇంటి స్థలంతో పాటు షెడ్లు నిర్మించి నిబంధనలు లేకుండా ప్రతి చేనేత కుటుంబానికి ముద్ర రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం మండల కమిటీ అధ్యక్షులు మాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం ఆధ్వర్యంలో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్ కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి జింక నాగరాజు, సిపిఎం మండల కమిటీ సభ్యులు కొండా వెంకటేశులు, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

అఖిలభారత మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నల్లచెరువు

ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్టణంలో నిర్వహించే సిఐటియు జాతీయమహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నల్లచెరువు మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి విరాళాల సేకరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జగన్మోహన్, మండల కార్యదర్శి రామకృష్ణానాయక్, రైతు సంఘం శ్రీరాములు, వెంకటస్వామి. భవన నిర్మాణ కార్మికుడు మురావ, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ :డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖ పట్టణంలో నిర్వహించే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు మడకశిరలో సోమవారం మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసు , రామాంజనేయులు, రవి, హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

తిరుపతి పద్మశాలి భవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీలలో కదిరి విద్యార్థులు పతకాల పంట పండించారు . ఈ పోటీలలో 14 మంది విద్యార్థులు కట, కుమితే విభాగాలలో పాల్గొనగా 6 బంగారు పతకాలు,11 వెండి పతకాలు, 5 కాంస్య పతకాలు సాధించారు. అందులో రీదా ముస్కాన్,రబ్బాన్, రెహాన్, హన్సి,ఆరాధ్య,బంగారు పతకాల ను, భవిత్ రాయల్, రబ్బాన్, మొహక్,ధరణిధర్,గగన్, త్రిష, జస్సి, హన్సి, ఫహీమ్ వెండి పతకాలను, రెహాన్, ఆర్యన్, కావ్య, తోషిక, ఆరాధ్య కాంస్య పతకాలను సాధించారు.

బాల్యవివాహ రహిత జిల్లాగా మారుద్దాం

పెనుకొండ టౌన్ : బాల్య వివాహ రహిత జిల్లా గా మార్చడానికి కృషి చేద్దామనిజిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ శివలత సచివాలయం మహిళా పోలీస్ ఉష పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ మూర్తి, ఇంచార్జి ప్రిన్సిపాల్ జబీర్ అహ్మద్, చరిత్ర అధ్యాపకులు మూర్తి, శివన్న, హఫీజ్, శంకర్ నాయక్, జయ ప్రకాష్, శ్రీలేఖ అధ్యాపక, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

10 నుంచి ఉపాధ్యాయులకు టెట్

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఈనెల 10వ తేదీ నుండి 21వ తేదీ వరకు జిల్లాలోనే ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో కిష్టప్ప తెలిపారు. ఈ పరీక్షలకు పుట్టపర్తిలో ఒక కేంద్రాన్ని బెంగళూరులో మరొక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు హాల్ టికెట్లు గుర్తింపు కార్డుతో పాటు ఒక గంట ముందుగానే కేంద్రానికి హాజరు కావాలన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు డిఇఒ వివరించారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి - నల్లమాడ

మండలంలోని శ్రీనివాస, శ్రీలక్ష్మి వెంకటేశ్వర, హనుమాన్ ఫర్టిలైజర్ దుకాణాలను ఎఒ అబ్దుల్ సోమవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, సేల్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎరువులు, పురుగుల మందులను నిర్ణయించిన ధరకే అమ్మాలని ఆదేశించారు.

అక్రమ లేఅవుట్లు వేస్తే చర్యలు

ప్రజాశక్తి - రొళ్ల

మండల కేంద్రంలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ లేఅవుట్లు వేస్తే చర్యలు తీసుకుంటామని ఇఒఆర్‌డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం మండల కేంద్రంలో పర్యటించి పలు అక్రమ లేఅవుట్ల తొలగింపు చర్యలు చేపట్టారు.పంచాయతీ కార్యదర్శుల అనుమతులు లేకుండా వేసిన లే అవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేయొద్దని ప్రజలకు సూచించారు.